క్లుప్తంగా

ఆత్మీయ సత్కారం



భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న లలితా థామస్

తిరుపతి మంగళం: తిరుపతి పద్మావతిపురంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డిని ఆదివారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే లలితాథామస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఉమ్మడి జిల్లా రాజకీయ పరిణామాలపై కొంత సేపు మాట్లాడారు.

మా గోడు పట్టించుకోరా..!



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పీహెచ్‌సీలో పని చేసే వైద్యుల గోడును పట్టించుకోవాలని వైద్య సంఘ నాయకులు శిరీష, చంద్ర మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కూడా సమ్మె కొనసాగించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పీజీ కోటాను తగ్గించడం సరికాదన్నారు. దీనికితోడు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నివేదించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు ఉన్నారు.

టెట్ పరీక్ష సమస్యపై ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు




మాట్లాడుతున్న డా.స్వామికణ్ణన్

చిత్తూరు కలెక్టరేట్ : టెట్ పరీక్ష సమస్య పరిష్కారానికి పీఆర్‌టీయూ సంఘం ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డా.స్వామికణ్ణన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులుగా నియమించబడిన వారు ప్రస్తుతం సర్వీస్‌లో కొనసాగాలన్నా, ఉద్యోగోన్నతి పొందాలన్నా టెట్ తప్పనిసరి అని చెప్పడం ఆందోళనకు తావిస్తోందన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి నోటిఫికేషన్ 2010 ఆగస్టు 23వ తేదీ ప్రకారం 2010కి ముందు వివిధ డీఎస్సీ నోటిఫికేషన్లలో నియమింపడిబడిన వారికి టెట్ ఉత్తీర్ణతతో సంబంధం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించడం సాధ్యం కాదని చెప్పారు. ఇది అమలైతే ఉద్యోగోన్నతులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడుతుందన్నారు. దీన్ని అధిగమించేందుకు విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(2) ప్రకారం టెట్‌కు తాత్కాలిక మినహాయింపు ఇవ్వవచ్చని తెలిపారు. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన డీఎస్సీలలో నియమింపబడిన వారికి సర్వీస్‌లో కొనసాగడానికి, ఉద్యోగోన్నతి పొందడానికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(2)కి సవరణ, టెట్ సమస్యను పరిష్కరించాలంటూ కేంద్రస్థాయిలో పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. ఇటీవల కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడును కలిసి టెట్ సమస్య పరిష్కారంపై వినతిపత్రం ఇచ్చారని వెల్లడించారు.







తరగతి గది వద్ద విద్యార్థులతో కలిసి పూల మొక్కను నాటుతున్న హెచ్ఎం, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు, ఆర్ఓ వాటర్‌ప్లాంట్

స్వచ్ఛత మురిసె.. అవార్డు మురిసె

స్వచ్ఛతలో ఆ పాఠశాల మెరిసింది. జిల్లాస్థాయిలో అవార్డుకు ఎంపికైంది. ఐరాల మండలంలోని మారుమూల గ్రామమైన బీరప్పచెరువు జెడ్పీ హైస్కూల్ జిల్లా స్థాయిలో అరుదైన పురస్కారానికి ఎంపిక కావడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాస్థాయిలో స్వచ్ఛత స్కూళ్లు ఎంపిక
- మొత్తం ఆరు స్కూళ్లలో బీరప్పచెరువు పాఠశాల కూడా ఒకటి
- నేడు చిత్తూరులో కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరణ
- సమష్టి కృషితో పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం
- హర్షం వ్యక్తం చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, స్థానికులు



పచ్చదనంతో బీరప్పచెరువు జెడ్పీ హైస్కూల్

ఐరాల: జిల్లాలో మొత్తం ఆరు ప్రభుత్వ స్కూళ్లను స్వచ్ఛ పాఠశాలలుగా ఎంపిక చేయగా అందులో బీరప్పచెరువు స్కూల్ కూడా ఒకటి. స్వచ్ఛత పాఠశాలగా తీర్చిదిద్దడంలో హెచ్ఎం ఉషారాణి కీలక భూమిక పోషించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, స్థానికుల సహకారంతో పాఠశాల కోసం విశేష కృషి చేశారు. మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు స్కూల్ ఆవరణను హరితమయం చేయడంలో విజయం సాధించారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ రక్షణ, ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించడంలో లక్ష్యాలను అధిగమించారు. పరిశుభ్రత కార్యక్రమాలు, ఆట స్థలం, తోటలు సంరక్షించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడే వాతావరణాన్ని సృష్టించి.. విద్యార్థుల్లో శుభ్రతపై అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చారు. దీంతో 2025లో బీరప్పచెరువు జెడ్పీ హైస్కూల్ తొలిసారి జిల్లాస్థాయి పురస్కారం లభించింది.

పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ..

పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడం, సంరక్షించడం, తరగతి గదుల వద్ద పూల మొక్కలు పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛమైన గాలిని ఇచ్చే మొక్కలు పెంచి కాపాడడం ద్వారా ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ప్రత్యేక చొరవ చూపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన ఆర్ఓ నీరు అందిస్తున్నారు. నీటిని వృథా చేయకుండా పరిమితంగా వాడడం, వృథా నీటిని చెట్లకు మళ్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ఆవరణ సుందర ఉద్యానవనాన్ని తలపిస్తుంది. విద్యార్థులు చదువుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పరిశుభ్రమైన తరగతి గదులు, ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా తీర్చిదిద్దడంతో జిల్లా విద్యాశాఖ అధికారుల బృందాన్ని ఆకట్టుకుంది. దీంతో జిల్లాస్థాయిలో స్వచ్ఛత అవార్డు గౌరవం దక్కింది.

సమష్టి కృషితో అవార్డు



మా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, స్థానికుల సమష్టి కృషితో జిల్లాస్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం పెంచడంలో స్థానికుల కృషి మరువలేనిది. మండల కేంద్రం నుంచి మా పాఠశాలకు 60 మంది విద్యార్థులు వస్తున్నారంటే అది మా ఉపాధ్యాయుల అంకిత భావానికి నిదర్శనం. పాఠశాలకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డు పొందడం గర్వకారణం.

– ఉషారాణి, హెచ్ఎం, బీరప్పచెరువు, ఐరాల

చలో విజయవాడ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావొస్తున్నా ఇంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించి ప్రస్తుతం అమలు చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. ఉద్యోగ సంఘాలను ఇంత వరకు కనీసం చర్చలకు పిలవకపోవడం అన్యాయమన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి వెంటనే చైర్‌పర్సన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతానికి తగ్గకుండా ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీలో ఎంపికై 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత విధుల్లో చేరిన టీచర్లకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మెమో నంబర్ 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు, టీచర్లు అధిక సంఖ్యలో విచ్చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.30 వేల కోట్ల పెండింగ్ నిధులను దశలవారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలను రూపొందించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు జేఎల్స్‌గా, ఎంఈఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రన్, చిత్తూరు డివిజన్ కన్వీనర్ ఢిల్లీప్రకాష్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్మాన్



తపస్సు మాను ఘట్టాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తజనం

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం సాయంత్రం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో 120వ సంవత్సర మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సంత గేటులో అర్జున తపస్సును భక్తితో నిర్వహించారు. ద్రౌపదీ దేవి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు, తపస్సు మానుకు భక్తులు విశేషంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నాడు. అనంతరం కళాకారుడు మణికంఠ అర్జునుడి వేషధారణలో తపస్సు మానును అధిరోహించారు. పైనుంచి విసిరిన విబూధి, నిమ్మపండ్లు, బొరుగులు, బిల్వ ఆకులు, అరటి పండ్ల కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం కోసం మహిళలు తడిదుస్తులతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సమాజంలో గురువులదే అత్యున్నత స్థానం



పదవీ విరమణ పొందిన ఎంఈఓ, ఉపాధ్యాయులతో తోటి సిబ్బంది

తవణంపల్లె: విద్యార్థులతో పాటు సమాజాన్ని ప్రభావితం చేసేది గురువులేనని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఎంఈఓ హేమలత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్ ఉపాధ్యాయులచే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు దిశానిర్దేశం చేసి వారి అభ్యున్నతికి బాటలు వేసే గురువులను నిత్యం పూజించాలన్నారు. ఎంఈఓలు హేమలత, మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువులకు అత్యున్నత స్థానం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, పదవీ విరమణ పొందిన ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, ఉపాధ్యాయులను, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను శాలువలు కప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బంగారుపాళ్యం మార్కెట్‌కమిటీ చైర్మన్ భాస్కర్‌నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

బంగారుపాళెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్ రాజా స్వగృహంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ సమావేశానికి హాజరు అవుతారని.. మండలంలోని నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని శ్రీవిజ్ఞానతేజ స్కూల్‌లో సోమవారం సీఎంసీ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు టి.కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ వైద్య పరీక్షలు ప్రారంభమవుతుందన్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలనిఆయన పేర్కొన్నారు.

35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తామన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో ఉభయదారులచే స్వామివారికి శాస్త్రోక్తంగా సుదర్శన హోమం, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలల్లో రాస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రీయ అవిష్కార్ సప్తాహ్ (రాస్) కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రాస్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చెట్ల పెంపకం, నీటి సంరక్షణ అంశాలపై షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పీహెచ్‌సీ శుభ్రతకు నిధుల్లేవంట..!

పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉంటుందని వైద్యులు, అధికారులు, పాలకులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పీహెచ్‌సీల్లోనే అపరిశుభ్ర వాతావరణం నెలకొన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకు యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే సాక్ష్యంగా నిలుస్తోంది. ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో దోమలు రాత్రిపగలూ తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. పరిసరాల శుభ్రం కోసం జిల్లా వైద్యాధికారిని సంప్రదిస్తే నిధులు లేవని చెబుతున్నారని స్థానిక సిబ్బంది చెబుతున్నారు.

- యాదమరి పీహెచ్‌సీలో కొరవడిన పారిశుద్ధ్యం
- పిచ్చిమొక్కలతో విషసర్పాలకు ఆవాసం
- సమస్య చెబితే నిధులు లేవని జిల్లా వైద్యాధికారి దాటవేత
- జేసీబీతో శుభ్రం చేయిస్తానని బీరాలు పలికిన ఓ కూటమి నేత
- ఆపై స్పందన శూన్యం
- ఆందోళన చెందుతున్న వైద్యులు, రోగులు



యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రి ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

యాదమరి : అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు బారిన పడి రోగులు పీహెచ్‌సీలకు క్యూ కడుతున్నారు. అయితే యాదమరి పీహెచ్‌సీకి రోగంతో వెళ్లిన వారికి మరో కొత్త రోగం రాక మానదు. ఎందుకంటే పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా.. వర్షం వస్తే నీరు నిల్వ ఉంటుండడంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో దోమలు రాత్రి పగలూ తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. వైద్యసిబ్బంది సైతం దోమల దాడితో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దానికి తోడు విషసర్పాల బెడద వెంటాడుతోంది. అయితే అధికారులు కానీ.. పాలకులు కానీ పీహెచ్‌సీ ఆవరణ శుభ్రత కోసం చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ఈ పరిస్థితుల్లో సిబ్బంది విధులు నిర్వహించడం కష్టంగా మారింది.

సిబ్బంది భద్రత ప్రశ్నార్థకం..

అయితే రాత్రివేళలో పీహెచ్‌సీ సిబ్బందికి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి, ప్రసవానికి వచ్చిన వారికి భద్రత అంశం కలవరపెడుతోంది. పగటి వేళ అయితే రోగులు, వారితో పాటు వచ్చిన వారు సంచరిస్తుంటారు గనుక ఎటువంటి ఇబ్బంది లేదు. రాత్రివేళ విధులు నిర్వహించాలంటే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ వెళ్లదీస్తున్నారు. అయితే ఇదే సమస్య పరిష్కారం కోసం మండలానికి చెందిన ఓ కూటమినేత దృష్టికి తీసుకెళ్లగా తాను చూసుకుంటానని వాగ్దానం చేశారు. తదనంతరం కాలంలో ఆయన కార్యాచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

నిధులు లేవంట..

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి ఆవరణ మొత్తం బురదమయం కావడంతో వైద్యసిబ్బంది కొందరు జారి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పీహెచ్‌సీ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో అటు సిబ్బందితో పాటు స్థానికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పీహెచ్‌సీ వైద్యాధికారులను వివరణ కోరగా సమస్యను కూటమి నేతల దృష్టికి తీసుకెళ్లిన మాట వాస్తవమే అని చెప్పారు. ఓ కీలక నేత తన సొంత నిధులు వెచ్చించి జేసీబీ యంత్రంతో పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాకపోవడంతోనే ఇలానే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె నిధులు లేవని చెప్పడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు వైద్యసిబ్బంది. ఇకనైనా అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించి పీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించడంతో పాటు సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

ఇవే.. వ్యర్థ వ్యయాలు



కాజూరు చెరువు వద్ద పడేసిన వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: నగరంలోని కాజూరు సమీపంలో భవన వ్యర్థాలను రహదారుల పక్కనే పడేస్తున్నారు. చిత్తూరు–బెంగళూరు రోడ్డులోని కాజూరు సమీపంలో ఇప్పటికే రోడ్డు విశాలంగా లేక ఆక్రమణలతో.. కుదించుకుపోయింది. ఈ మధ్యకాలంలో భవన వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను కొందరు చెరువుకు పక్కనే పడేసి వెళ్లిపోతున్నారు. దీని గురించి ఎవరూ అడిగేవారు లేరు. ఇలా కొద్ది రోజులు గడచిన తరువాత వ్యర్థాల తొలగింపునకు రూ.లక్షలు వ్యయం చేసి, యంత్రాలతో వీటిని శుద్ధి చేసినట్లు రికార్డుల్లో కనబరచడం కార్పొరేషన్‌లో రివాజుగా మారింది.